క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: పైనాపిల్ కాలనీ 33/11 కేవీ ఎస్ఎస్ పరిధిలో విద్యుత్ నిర్వహణ పనులు జరగనుండడంతో శనివారం పలు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలగనుంది. స్థానిక 11 కేవీ ఫీడర్ పరిధిలో ఉన్న పైనాపిల్ కాలనీ, జీఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీ, సీఐడీ జోనల్ కార్యాలయం, కామాక్షినగర్, శ్రీకృష్ణాపురం, ఎస్ఎస్ఎన్ నగర్, విశాఖ కేంద్ర కారాగారం, రామకృష్ణాపురం ప్రాంతాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ ఆపరేషన్ పి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఉచిత దంత వైద్య శిబిరం నేడు

ఎంవీపీ కాలనీ: సెక్టార్–6లోని శ్రీవేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి ఈ శిబిరం అందుబాటులో ఉంటుందని ఆలయ కమిటీ కార్యదర్శి ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ రవిచంద్ర, డాక్టర్ చరిస్మా, డాక్టర్ కీర్తి తదితరుల బృందం వైద్య పరీక్షలు చేయనున్నారని పేర్కొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు, సిబ్బంది

ఎంవీపీ కాలనీ: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఎంవీపీ కాలనీలోని మెడికవర్ ఆస్పత్రిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది 'బ్యాక్ టు ది రూట్స్' నినాదంతో ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. మెడికవర్ హాస్పటల్ హెడ్(ఎంవీపీ) డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం కోసం పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.

హెల్త్‌కేర్ టెక్స్‌టైల్స్ ప్రాసెసింగ్ స్కీమ్ ప్రారంభం



లోగోను ఆవిష్కరిస్తున్న మెడ్ టెక్ జోన్ కమిటీ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: హెల్త్ కేర్ టెక్స్‌టైల్స్ ప్రాసెసింగ్ ఫెసిలిటి సర్టిఫికెట్ స్కీమ్‌ను ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో ప్రారంభించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఏపీ మెడ్ టెక్ జోన్ ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు మెడ్ టెక్ జోన్ కమిటీ ప్రతినిధులు శుక్రవారం లోగోను ఆవిష్కరించారు. వస్త్రాల ప్రాసెసింగ్‌లో బహుళ వినియోగ ఆరోగ్య సంరక్షణ కోసం ఈ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు.

నేడు ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం

డాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం శనివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు కళాశాల అల్యుమ్ని అధ్యక్షుడు అజ్జరావు సర్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్న పూర్వ విద్యార్థుల సమావేశంలో కళాశాల కరస్పాండెంట్ ఏపీ అదీప్ భానోజీరావు, ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు, పలువురు ప్రముఖులు పాల్గొంటున్నట్టు తెలిపారు.

రైలు పట్టాలపై వ్యక్తి మృతి

సింహాచలం: పెందుర్తి మండలం చింతలగ్రహారం సమీపంలోని రైలు పట్టాలపై వ్యక్తి మృతి చెందాడు. రైలు పట్టాలపై మృతదేహం ఉన్నట్టు గుర్తించి స్థానికులు శుక్రవారం పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతుడి జేబులో ఉన్న కాగితంపై ఫోన్ నెంబరు ఆధారంగా నగరంలోని మహారాణిపేటకు చెందిన మహ్మద్ ఇస్మాయిల్ (55)గా గుర్తించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రమాదవశాత్తు రైలు నుంచి పడిపోయాడో లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పండగలా 'జగనన్నే మా భవిష్యత్తు'



28వ వార్డులో ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న అక్కరమాని విజయనిర్మల



జీవీఎంసీ 10వ వార్డులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో సమన్వయకర్త అక్కరమాని

ఆరిలోవ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం శుక్రవారం తూర్పు నియోజకవర్గంలో పండగలా సాగింది. వార్డుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటింటికీ వెళ్లి మహిళ లు, వృద్ధులు, యువకులను పలకరించారు. జీవీఎంసీ 9,10,11,12,13 వార్డుల్లో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల పాల్గొని కార్పొరేటర్లు, ఇన్‌చార్జిలు, నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫొటో, సంక్షేమ పథకాల సమాచారంతో ముద్రించిన కరపత్రాలు అందజేశారు. ప్రజలను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాసుకున్నారు. సీఎం ఫొటోతో ఉన్న స్టిక్కర్లు ఇళ్ల గోడలకు అంటించారు. జోడుగుళ్లపాలెం నుంచి విశాలాక్షినగర్, డెయిరీ ఫారం, ఆదర్శనగర్, రవీంద్రనగర్, తోటగరువు, బాలాజీనగర్, పెదగదిలి, చినగదిలి, నెహ్రూనగర్, లీలాసుందరినగర్, లక్ష్మీనగర్, పైనాపిల్ కాలనీ వరకు ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కార్పొరేటర్లు స్వాతి, అక్కరమాని రోహిణి, కెల్ల సునీత, వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, కెల్ల సత్యనారాయణ, వీర్రాజు, జగ్గుపిల్లి జయలక్ష్మి, పతివాడ వెంకటలక్ష్మి, వైదా నారాయణరావు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం సాకారం

ఏయూ క్యాంపస్: రాష్ట్రంలో ప్రజలకు సంక్షేమ పథకాలను చేరువ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. 20వ వార్డు శ్రామికనగర్‌లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కుటుంబంలో వివిధ వయస్సుల వారికి లభిస్తున్న పథకాలను వివరించారు. సమాజంలో ప్రతి కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా ఉన్నతంగా ఎదగాలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముచ్చల లక్ష్మి, పార్టీ నాయకులు ముచ్చల సురేష్, సచివాలయం కన్వీనర్ రాము, మద్ది పోలిరెడ్డి, రమాదేవి, పండరీబాయి పాల్గొన్నారు.

బీచ్ రోడ్డు: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 22వ వార్డులో పోలీస్ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ ఆధ్వర్యంలో సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. గత టీడీపీ ప్రభుత్వానికి వైఎస్సార్‌సీపీ సర్కారుకు ఉన్న తేడాలను తెలియజేశారు.

➡ జీవీఎంసీ 28వ వార్డులో శుక్రవారం రాత్రి కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, పార్టీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, తదతరులతో కలిసి వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని నమోదు చేసుకున్నారు.

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మి, 19వ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి సారథ్యంలో జరిగిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరు ప్రజలకు వివరించారు. మా నమ్మకం నువ్వే జగన్ పేరుతో ఉన్న స్టిక్కర్లను ఇళ్లకు అంటించారు. ఈ కార్యక్రమాలు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎంవీపీ కాలనీలో పథకాల కరపత్రాలు అందిస్తున్న అక్కరమాని, తదితరులు



22వ వార్డులో ప్రజలతో మాట్లాడుతున్న పోలీస్ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ గోవింద్



20వ వార్డులో స్టిక్కర్ అతికిస్తున్న తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల

పక్షుల సంరక్షణ అందరి బాధ్యత



సీఎంఆర్ సెంట్రల్‌లో తాగునీటి గిన్నెలు పంపిణీ చేస్తున్న సీఎంఆర్ అధినేత మావూరి, గ్రీన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి గీతానారాయణ్

మద్దిలపాలెం: వేసవి తాపం నుంచి పక్షులను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని, వాటి దాహార్తి తీర్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ పిలుపునిచ్చారు. పక్షుల సౌకర్యార్థం తాగునీటి గిన్నెల పంపిణీ కార్యక్రమం మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌లో శుక్రవారం గ్రీన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. మావూరి ముఖ్యఅతిథిగా పాల్గొని పలువురికి తాగునీటి గిన్నెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతవరణంలో వస్తున్న మార్పుల దృష్ట్యా పక్షుల జీవనానికి ఎలాంటి ఆటంకం లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడికక్కడ పక్షులు దాహార్తిని తీర్చుకోవడానికి అనువుగా తాగునీటి గిన్నెల ఏర్పాటు చేయడానికి గ్రీన్ స్వచ్ఛంద సంస్థ ముందు రావడం అభినందనీయమన్నారు. డ్రగ్స్ డీజీ రవిశంకర్ నారాయణ్ మాట్లాడుతూ పక్షుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన గిన్నెలను రోజూ నీటితో నింపాలని సూచించారు. గ్రీన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు గీతానారాయణ్ సుడగాని మాట్లాడుతూ పదేళ్లుగా పక్షుల కోసం వేసవి కాలంలో తాగునీటి గిన్నెలను నగరంలోని ప్రతి కూడలిలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆడిటర్ శ్రీనివాస్ వైట్ల, జైలు సూపరింటెండెంట్ రాహుల్, వినోద్ పాల్గొన్నారు.

ఆటోలకు అడ్డా.. మద్దిలపాలెం

- రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలిపివేత
- హైవే దాటేందుకు పాదచారుల అవస్థలు



మద్దిలపాలెం ఆర్టీసీ డిపో ఎదురుగా రోడ్డుపై ఆపిన ఆటోలు

మద్దిలపాలెం: ఆటోలకు అడ్డాగా మద్దిలపాలెం కూడలి మారిపోయింది. రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలిపివేయడంతో పాదచారులు, వాహనచోదకులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ప్రధాన రహదారి కావడంతో ఈ కూడలిలో ఆటోలు తిష్ట వేస్తున్నాయి. ఇటు ఒడిశా నుంచి వయా శ్రీకాకుళం మీదుగా విశాఖ వచ్చే వాహనాలు, రాయ్‌పూర్ నుంచి వయా విజయనగరం మీదుగా వచ్చే వాహనాలతో పాటు, తగరపువలస నుంచి నగరంలోకి రాకపోకలు సాగించే జనంతో ఈ కూడలి కళకళలాడుతుంటుంది. దీనికి తోడు మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రాష్ట్ర నలుమూలలకు బస్సు సర్వీసులు నడుపుతున్నారు. దీంతో ఈ కూడలి నగరంలో అత్యంత రద్దీ ప్రాంతంగా మారింది. డే అండ్ నైట్ ఈ కూడలి నుంచి నగరంలో ఎక్కడికైనా ఆటోలు అందుబాటులో ఉంటాయి. ఈ క్రమంలో ఆటో డ్రైవర్లు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

➡ మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట అడ్డదిడ్డంగా ఆటోలను నిలిపివేయడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాంప్లెక్స్‌లోంచి బయట వచ్చే బస్సులకు సైతం మార్గం లేకుండా ఒక్కోసారి ఆటోలను అడ్డంగా పెడతున్నారు. దీంతో ప్రధాన రహదారిపై తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఆటోలను రోడ్డుపైనే నిలిపి ప్రయాణికులతో బేరసారాలు సాగిస్తున్నారు.

➡ ఆటోలను రోడ్ల మధ్యలో నిలిపి సర్వీసు చేసుకునే క్రమంలో ట్రాఫిక్‌కు ఆటంకం కలుగుతోంది. పోటాపోటీగా ఆటోలను నిలిపి సర్వీసు చేసుకోవడంతో పాదచారుల సైతం ఇబ్బందులు పడుతున్నారు.

➡ మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు కృష్ణా కళాశాల, హెచ్‌బీ కాలనీ ప్రాంతాలకు వెళ్లాలన్నా.. అటు పిఠాపురం కాలనీ, శివాజీపాలెం తదితర ప్రాంతాల నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు రావాలన్నా ప్రయాణికులు హడలిపోతున్నారు. జాతీయ రహదారిపై భారీ రాకపోకలు సాగించే ఆటోలు, భారీ వాహనాలు, ద్విచక్ర వాహనాలను దాటుకుంటూ బయటపడడానికి పెద్ద సాహసమే చేయాల్సి వస్తోందని చెబుతున్నారు.

➡ నిత్య వేలాది జనం రాకపోకలు సాగించే మద్దిలపాలెం కూడలి వద్ద ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఆటోలను క్రమ పద్ధతిలో ఆపి సర్వీసు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



క్రీస్తు శిలువతో శాంతి ప్రదర్శన



ఆరిలోవ నిత్య సహాయ మాత ఆలయంలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



క్రీస్తు సందేశం వినిపిస్తున్న రిటైర్డ్ జడ్జి రత్నకుమార్

ఆరిలోవ: గుడ్ ఫ్రైడే వేడుకలను తూర్పు నియోజకవర్గంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆరిలోవ ప్రాంతంలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక లీలాసుందరినగర్‌లో నిత్య సహాయ మాత ఆలయంలో జరిగిన వేడుకల్లో క్రైస్తవులు ఏసు క్రీస్తును ప్రార్థించారు. కేరళ ధ్యాన కేంద్రం ఫాదర్ షింటూ, ఫాదర్ సీహెచ్.విజయ్‌కుమార్ ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి కౌన్సిల్ సభ్యులు పి.ఐ.బాలరాజు, పి.మాణిక్యాలరావు, ఎం.బాబూరావు, చర్చి సిస్టర్లు పాల్గొన్నారు.

మద్దిలపాలెం: గుడ్ ఫ్రైడే సందర్భంగా హెచ్‌బీ కాలనీ, మద్దిలపాలెం, కేఆర్ఎం కాలనీ ప్రాంతాలలో క్రైస్తవులు శాంతి ప్రదర్శనలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని చర్చి సభ్యులు క్రీస్తు శిలువతో ప్రదర్శన చేపట్టారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. గుడ్ ఫ్రైడే విశిష్టతను తెలుపుతూ కరపత్రాలు పంపిణీ చేశారు.

మానవాళి పాప విమోచనకే క్రీస్తు శిలువ మరణం

ఎంవీపీ కాలనీ: క్రైస్తవులు అత్యంత పవిత్రంగా భావించే శుభ శుక్రవారం(గుడ్ ఫ్రైడే) వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఎంవీపీ కాలనీలోని పలు చర్చిల్లో గత 40 రోజులుగా క్రైస్తవులు చేస్తున్న ఉపవాస దీక్షలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా క్రీస్తు శిలువ మరణ విశిష్టతను విశదీకరిస్తూ పలు చర్చిల్లో బోధకులు సందేశాలిచ్చారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–2 లోని ఇమ్మానియేల్ లూథరన్ చర్చిలో ఏపీ హైకోర్టు రిటైర్డ్ సివిల్ జడ్జి జేసురత్నకుమార్ మాట్లాడుతూ మానవాళి కోసం క్రీస్తు చేసిన త్యాగాలను వివరించారు. మానవాళి పాప విమోచనకై ఏసుక్రీస్తు శిలువ మరణం పొందారన్నారు. అనంతరం సాయంత్రం 3 గంటలకు క్రీస్తు మరణాన్ని గుర్తు చేసుకుంటూ చర్చి గంటలు మోగించారు. శిలువ మరణం నుంచి క్రీస్తు 3వ రోజు సజీవుడుగా తిరిగి లేచినట్లు ఆయన వెల్లడించారు. అందుకే 3వ రోజైన ఆదివారాన్ని ఈస్టర్‌గా జరుపుకొంటామని తెలిపారు.


తృణధాన్యాలతో ఆరోగ్యానికి మేలు



వాకర్స్‌కు రాగిసంకటి అందిస్తున్న ఉప్పలపాటి శుభ, క్లబ్ సభ్యులు

మురళీనగర్: తృణధాన్యాలతో తయారు చేసిన ఆహారం ఆరోగ్యానికి మేలు చేస్తుందని వాకర్స్ డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ ఉప్పలపాటి శుభ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని గాంధీ విగ్రహం వద్ద వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రభాశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆకర్షణీయంగా ఉండే తెల్లని పదార్థాలు తింటే ఆరోగ్యానికి హాని చేస్తాయన్నారు. వీలైనంతలో వైట్ రైస్, ఉప్పు, పంచదార ఆహారంలో తగ్గించుకోవాలని సూచించారు. ముఖ్యంగా బీపీ, సుగర్ ఉన్న వారు వీటిని తగ్గించుకోవడంతోపాటు ప్రతి రోజూ వాకింగ్ చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రభాశర్మ స్వయంగా తయారు చేసిన రాగి సంకటిని వంద మంది వాకర్లకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వనితా వాకర్స్ క్లబ్ కార్యదర్శి రోజారాణి, కోశాధికారి షీలారాణి, ప్రోగ్రాం ఇన్‌చార్జి శిరీషలత, సలహా సంఘం సభ్యురాలు బిందురాణి, పూర్వ కోశాధికారి జయ, కమిటీ సభ్యులు మంగాదేవి, వసుంధర, సురేంద్ర కౌర్ పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక సంగీత కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న గాయని రిషిత లక్ష్మి

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం కర్ణాటక సంగీత కచేరీ జరిగింది. గన్నవరపు రిషిత లక్ష్మి అద్భుత గానంతో త్యాగరాజ, రామదాసు, ముత్తుస్వామి దీక్షితులు కీర్తనలు ఆలపించి ఆహుతులను అలరించారు. వాతాపి గణపతిం, సీతమ్మ, మరుగేలరా, ఎవరూర, ఉపచారము, మా జానకి, తెలిసిరామ, పలుకే బంగార, చరణములే, శ్రీరామ నీనామం, ఎంత పనిచేసితివి కీర్తనలు భక్తులను సంగీత సాగరంలో ఓలలాడించాయి. ఈమెకు ఎస్.కృష్ణప్రియ వయోలిన్‌పై, బి.గిరిధర్‌రెడ్డి మృదంగంపై వాద్య సహకారం అందించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయని రిషితను అభినందించి సత్కరించారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో రమేష్‌నాయుడు తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

14 నుంచి సీపీఐ, సీపీఎం ఇంటింటి ప్రచారం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ, సీపీఎం కార్యదర్శులు పైడిరాజు, జగ్గునాయుడు

అల్లిపురం: ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనపై, సమస్యల పరిష్కారంలో చూపుతున్న నిర్లక్ష్యంపై ప్రజలకు వివరించేందుకు సీపీఐ, సీపీఎం పార్టీలు ఈ నెల 14 నుంచి జిల్లాలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తాయని ఆ పార్టీల కార్యదర్శులు ఎం.పైడిరాజు, ఎం.జగ్గునాయుడు తెలిపారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీ మతోన్మాద విధానాలను అనుసరిస్తూ పాలన సాగిస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.కె.రెహమాన్, పి.చంద్రశేఖర్, సీఎస్ క్షేత్రపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, ఎం.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

అల్లిపురం: ఇద్దరు వ్యక్తుల మధ్య వెటకారం చిలికి చిలికి కత్తితో దాడికి దారితీసిన ఘటన వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పూర్ణామార్కెట్ దరి కల్లు పాకలు ప్రాంతానికి చెందిన గంగాడ గోవింద్ మార్కెట్ సమీపంలో గల ఒక హోటల్లో మధ్యాహ్నం భోజనం చేస్తున్నాడు. అదే సమయంలో అక్కడికి అదే ప్రాంతానికి చెందిన గండిబోయిన దుర్గాప్రసాద్ కూర కొనుగోలుకు వచ్చాడు. అక్కడే భోజనం చేస్తున్న గోవింద్ అతన్ని చూసి వెటకారం చేశాడు. దీంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. అది కాస్త తోపులాటకు దారి తీసింది. అనంతరం దుర్గాప్రసాద్ బయటికి వెళుతుండగా గోవింద్ వెనుక నుంచి వెళ్లి బటన్ నైఫ్‌తో నాలుగు చోట్ల పొడవటంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో కేజీహెచ్‌లో చికిత్స అనంతరం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోగుల సహాయకుల కోసం షెడ్ల నిర్మాణం



వెయిటింగ్ హాలును ప్రారంభించిన డాక్టర్ అశోక్ కుమార్ తదితరులు

- కేజీహెచ్ గైనిక్ వార్డు వద్ద ఏర్పాటు

మహారాణిపేట: ఉత్తరాంధ్రలో రోగులకు పెద్ద దిక్కుగా ఉన్న కింగ్ జార్జి ఆస్పత్రి ప్రసూతి రోగుల సహాయకుల కోసం వెయిటింగ్ షెడ్లు నిర్మించారు. రూ. 12 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఈ నిర్మాణం జరిగింది. గతంలో రోగులు ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే వారి సహాయకులు వార్డు బయట ఎండకు ఎండి, వానకు తడిసి వార్డు పడిగాపులు కాసేవారు. ఆకస్మిక తనిఖీలు చేసినప్పుడు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున రోగుల సహాయకుల బాధలు చూసి చలించిపోయారు. సీఎస్ఆర్ నిధులతో వెయిటింగ్ హాలు నిర్మించాలని ఆదేశించారు. దీంతో ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీఏ నాయుడు ఆధ్వర్యంలో డీఈఈ మన్మథరావు షెడ్లు నిర్మించారు. సామగ్రి భద్రపరచుకోవడానికి కప్‌బోర్డులు, సెల్‌ఫోన్ చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క షెడ్డులో 20 నుంచి 30 మంది వరకు ఉండడానికి వీలుగా నిర్మాణం జరిగింది. అన్ని సదుపాయాలతో నిర్మించిన వెయిటింగ్ హాలును శుక్రవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ డి.రాధాకృష్ణ, డాక్టర్ ఎ.పద్మజ, ఏఆర్ఎంవో డాక్టర్ కె.జగదీష్‌కుమార్, గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెయిటింగ్ హాలు కోసం నిధులు మంజూరు చేసిన కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఆస్పత్రి అభివృద్ధికి కలెక్టర్ ఎంతో సహకారం అందిస్తున్నారని డాక్టర్ అశోక్‌కుమార్ అన్నారు.

బాధితులు నైతిక విజయం సాధించారు

డాబాగార్డెన్స్: వాకపల్లి కేసులో బాధితులు నైతిక విజయం సాధించారని మహిళా చేతన కార్యదర్శి కె. పద్మ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం పలు ప్రజా సంఘాల నాయకులతో కలిసి మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కూంబింగ్ ఆపరేషన్‌లో భాగంగా 21 మంది ప్రత్యేక పోలీసు బృందం 2007, ఆగస్టు 20న ఏఎస్ఆర్ జిల్లా జి.మాడుగుల మండలంలోని వాకపల్లికి వెళ్లారన్నారు. అలా వెళ్లిన పోలీసులు తమపై లైంగిక దాడికి పాల్పడ్డారని 11 మంది ఆదివాసీ మహిళలు ఆ రోజు ఉదయమే ఫిర్యాదు చేశారన్నారు. ఈ కేసులో దర్యాప్తు సక్రమంగా జరగలేదని మహిళా సంఘాలు, ఆదివాసీ సంఘాలు, మానవ హక్కుల సంఘాలు ఎన్నో ఏళ్లుగా అంటున్నది నిజమేనని రుజువైందన్నారు. సమావేశంలో మానవ హక్కుల వేదిక ప్రతినిధి కృష్ణ, ప్రగతిశీల, చైతన్య, అఖిల భారత ప్రజాతంత్ర, ఏపీ మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.